క్లుప్తంగా

ఇ- శ్రమ్ పథకంలో నమోదు చేసుకోండి

మాడుగుల రూరల్ : వ్యవసాయ రంగం, భవన నిర్మాణ రంగంలో పనిచేసే కార్మికులు, ఆశ కార్యకర్తలు, వలస కార్మికులు, తదితరులు ఇ-శ్రమ్ పథకంలో ఉచితంగా నమోదు చేసుకుని, కార్డులు పొందాలని ఎంపీడీవో కొంకి అప్పారావు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగి వున్న వారు ఈ పథకంలో నమోదు కావచ్చునని, పూర్తి వివరాల కోసం సమీపంలో గల గ్రామ సచివాలయం లేదా మీ సేవా కేంద్రంలో లేదా కార్మికశాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఈఎస్ఐ, పీఎఫ్ పొందుతున్న కార్మికులు ఈ పథకానికి అర్హులు కారని పేర్కొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సహాయం అందిస్తున్న తోటి విద్యార్థులు

గొలుగొండ : ఏఎల్‌పురం జిల్లా పరిషత్ హైస్కూల్లో 2007 బ్యాచ్‌కి చెందిన నర్సె శ్రీను (33) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో అతని స్నేహితులు శ్రీను తల్లిదండ్రులకు రూ.45 వేల ఆర్థిక సహాయం అందచేశారు. శ్రీను నెల రోజులు క్రితం కిడ్నీ వ్యాధితో బాధపడుతూ మృతి చెందడంతో ఆ కటుంబాన్ని ఆదుకోవడం కోసం ఈ నగదు అందించారు.

కిరాణా షాపుల్లో తనిఖీలు



జోగుంపేట కిరాణా షాపులను పరిశీలిస్తున్న తూనికలు, కొలతల అధికారి

గొలుగొండ : మండలంలో పలు కిరాణా షాపులను నర్సీపట్నం తూనికల కొలతల శాఖ అధికారి అనురాధ బుధవారం పరిశీలించారు. జోగుంపేట, గొలుగొండ, గుండిపాల, చీడిగుమ్మల తదితర గ్రామాల్లో వ్యాపారాలు నిర్వహిస్తున్న షాపులను పరిశీలించారు. కాటాను పరిశీలించి తునికలు తక్కువగా ఉన్న షాపులపై కేసులు నమోదు చేసినట్టు ఆమె తెలిపారు. జోగుంపేట కిరాణా షాపుల్లో కొలతల్లో బియ్యం తక్కువగా ఉన్నట్టు గుర్తించామన్నారు. వినియోగదారులకు షాపుల యజమానులు నాసిరకం వస్తువులు అమ్మినా, తూనికల్లో తక్కువగా వచ్చినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఘనంగా వీరాంజనేయ తీర్థం



కింతలిలో స్వామి వారి సన్నిధిలో భక్తులు

మాడుగుల రూరల్ : మండలంలో కింతలి గ్రామంలో వీరాంజనేయ స్వామితీర్థం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు భక్తులు నిర్వహించారు. స్థానిక వీరాంజనేయ స్వామి ఆటో యూనియన్, ఆలయ కమిటీ వారు సంయుక్తంగా ఈ తీర్థం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద భజన పోటీలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు సాయంత్రం మహిళలకు ముగ్గుల పోటీలు, కోలాటం ఏర్పాటు చేశారు.

ఆదమరిస్తే ప్రమాదమే



రక్షణ గోడలు లేని కల్వర్టు

కె.కోటపాడు : డి.అగ్రహారం-కొరువాడ గ్రామాల మధ్య గల రైవాడ కెనాల్ మార్గంలో గల కల్వర్టుకు రక్షణ గోడలు లేక ప్రమాదకరంగా మారింది. కెనాల్‌ను ఆనుకొని ఉన్న మట్టిరోడ్డు మధ్యలో కొండగెడ్డ నీరు ప్రవహించేందుకు కల్వర్ట్ నిర్మించారు. అయితే దానికి రెండు వైపులా రక్షణ గోడలు నిర్మించలేదు. కల్వర్ట్ పరిసరాల్లో మొక్కలు నిండి ఉండడం వల్ల ఈ మార్గంలో ఆదమరచి ప్రయాణించే వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి కల్వర్ట్‌కు రెండు వైపులా రక్షణ గోడలు నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు.

ఘనంగా నాగవల్లి సేవ



చీడికాడ : అర్జునగిరి స్వయంభూ శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవరాహలక్ష్మీ నృసింహస్వామి వారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా బుధవారం నాగవల్లి సేవ నిర్వహించినట్టు ప్రధాన అర్చకుడు శ్రీనివాసాచార్యులు తెలిపారు. ఉత్సవ మూర్తులతో పల్లకీ సేవ నిర్వహించామన్నారు.



వాలాబు రోడ్డులో కనుచూపు మేర రాళ్లు తేలిన దృశ్యం

అడుగడునా గోతులు... రోడ్డు మధ్యలో గుంతలు. కనుచూపు మేర రాళ్లు తేలిన రోడ్డు. ఇది దేవరాపల్లి నుంచి వాలాబు వెళ్లే ప్రధాన రోడ్డు దుస్థితి. రెండు నెలల క్రితం వరకు బాగున్న ఈ రోడ్డును కేవలం రెండు నెలల వ్యవధిలో నామరూపాలేకుండా ధ్వంసం చేశారు.



భారీ వాహనాల రాకపోకలతో ధ్వంసమైన దేవరాపల్లి-వాలాబు తారురోడ్డు

14 గ్రామాలకు నరకప్రాయం

- గోతులమయంగా దేవరాపల్లి-వాలాబు రోడ్డు
- అధిక లోడుతో వాహనాలు రాకపోకలతో రోడ్డు ధ్వంసం
- రెండు నెలల వ్యవధిలో ఘోరంగా దెబ్బ తిన్న రోడ్డు
- 14 గ్రామాల గిరిజనులకు తప్పని ఇక్కట్లు
- తక్షణమే పునఃనిర్మించాలని డిమాండ్



రోడ్డు మధ్యలో భారీ గుంతలతో చిద్రంగా మారిన రోడ్డు దుస్థితి

దేవరాపల్లి : దేవరాపల్లి నుంచి గిరిజన పంచాయతీ వాలాబు వెళ్లే తారు రోడ్డు ప్రస్తుతం మరీ అధ్వానంగా దర్శనమిస్తుంది. రోడ్డు మొత్తం గుంతలు పడడంతో వాలాబు పంచాయతీ పరిధిలోని గ్రామాలకు చేరుకోవడం నరకప్రాయంగా మారింది. వాలాబు పంచాయతీలో పరిధిలోని శివారు గ్రామాలకు సీసీ రోడ్లు నిర్మాణానికి మెటీరియల్‌ను అధిక లోడుతో ఈ రోడ్డు మీదుగా తీసుకెళ్లడంతో రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతున్న కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా పరిమితికి మించి లోడుతో భారీ వాహనాలలో మెటీరియల్ తీసుకు రావడంతోనే ఈ రోడ్డు ఘోరంగా తయారైంది. కేవలం రెండు నెలల వ్యవధిలో రోడ్డు రూపు రేఖలు లేకుండా మార్చేశారు. దేవరాపల్లి నుంచి సుమారు 10 కిలోమీటర్ల మేర ఉన్న తారు రోడ్డులో అడుగడుగునా భారీ గుంతలు ఏర్పడ్డాయి. రోడ్డు పూర్తిగా శిథిలమవ్వడంతో ఆటోలు, ద్విచక్ర వాహనాలపై సైతం రాకపోకలు సాగించేందుకు ప్రజలు నరక యాతన అనుభవిస్తున్నారు. ఈ మార్గంలో ప్రయాణించి వారికి ఒళ్లు హూనమవ్వడంతో పాటు వాహనాలు సైతం షెడ్డుకు చేరుకుంటున్నాయి. చిద్రంగా మారిన రోడ్డులో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా పాలకులు పట్టించుకోక పోవడంపై స్థానిక గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాలాబు పంచాయితీలో సీసీ రోడ్లు నిర్మిస్తున్నారని ఆశపడితే, ఇలా ప్రధాన రహదారిని నామరూపాలేకుండా ధ్వంసం చేశారని గిరిజనులు తీవ్రంగా మండిపడుతున్నారు. వెరసి కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడిపోయిందన్న చందంగా స్థానిక గిరిజనుల ప్రజలు పరిస్థితి దాపరించింది. అధికార్లు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి తారు రోడ్డు నిర్మించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు

ఈ రోడ్డులో ప్రయాణమంటే భయమేస్తుంది



వాలాబు నుంచి దేవరాపల్లి చేరుకోవాలంటే నరకం చూస్తున్నాం. రాత్రి పూట ఈ రోడ్డులో ప్రయాణించాలంటే భయమేస్తుంది. రోడ్డు పూర్తిగా ధ్వంసమవ్వడంతో రోజు ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనాల సైతం తరుచూ మరమ్మత్తులకు గురవుతున్నాయి. అధికార్లు, ప్రజాప్రతినిధులు స్పందించి తారు రోడ్డు నిర్మించాలి.

– బిటి.దొర, ఇప్పగరువు, గ్రామం.

అధికలోడు వాహనాల వల్లే...



దేవరాపల్లి నుంచి వాలాబు వేళ్లే రోడ్డు ప్రమాదకరంగా మారింది. రోడ్డు మధ్యలో భారీ గోతులు ఏర్పడడంతో రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాలాబు సీసీ రోడ్ల నిమిత్తం భారీ వాహనాలలో మెటీరియల్స్ తీసుకురావడంతో రెండు నెలల వ్యవధిలో రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. ఈ రోడ్డులో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికార్లు వెంటనే స్పందించి రోడ్డు నిర్మించేలా చర్యలు చేపట్టాలి.

– బాణం రాంబాబు, పాతవాలాబు గ్రామం

విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు



కొండలఅగ్రహారంలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంపీడీవో

మాకవరపాలెం: విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో సీతామహాలక్ష్మి సచివాలయ సిబ్బందిని హెచ్చరించారు. మండలంలోని లచ్చన్నపాలెం, కొండలఅగ్రహారం సచివాలయాలను ఆమె బుధవారం సందర్శించారు. రికార్డులను తనిఖీలు చేశారు. వేళకు సచివాలయాలకు హాజరుకావాలని, ప్రజలకు అందుబాటులో లేకుంటే చర్యలు తప్పవన్నారు. ప్రజలను నుంచి ఫిర్యాదులు వస్తే సహించేది లేదన్నారు. పారిశుధ్యం, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

ఆధార్ సెంటర్ ప్రారంభం



ఆధార్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న బ్యాంకు మేనేజర్ నారాయణరావు

మాడుగుల : మాడుగుల గాంధీ పార్కు వద్ద గల యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో నూతనంగా బుధవారం ఆధార్ సెంటర్‌ను ప్రారంభించారు. బ్యాంకు మేనేజర్ నారాయణరావు, అసిస్టెంట్ బ్యాంకు మేనేజర్ ప్రశాంత్ ఈ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సెంటర్‌లో పుట్టిన తేదీ, ఇతర చిరునామా, పేర్లు, మార్పులు తదితర సవరణలు చేస్తారని బ్యాంకు మేనేజర్ తెలిపారు. సెంటర్ ఆపరేటర్ యడ్ల రామలక్ష్మి, యడ్ల మహేష్, బ్యాంకు ఖాతాదారులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుల నియామకం



శేనాపతి వెంకటరత్నం
నర్సీపట్నం



ఏకా శివప్రసాద్
నర్సీపట్నం మున్సిపాలిటీ



లెక్కల సత్యనారాయణ
గొలుగొండ



చిటికెల రమణ
మాకవరపాలెం

నర్సీపట్నం/గొలుగొండ/నాతవరం : వైఎస్సార్ సీపీ నర్సీపట్నం మండల అధ్యక్షుడిగా శేనాపతి వెంకటరత్నం, ఉపాధ్యక్షులుగా రుత్తల నాయుడు, పెట్ల చిన్న అప్పలనాయుడుతో పాటు 28 మంది కమిటీ సభ్యులుగా నియమితులయ్యారు. మున్సిపాలిటీ పరిధి ఏకా శివప్రసాద్, ఉపాధ్యక్షులుగా యాదగిరి శేషుబాబు, సుర్ల అప్పలనాయుడుతో పాటు కమిటీ సభ్యులను నియమిస్తూ వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. గొలుగొండ మండలం వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడుగా లెక్కల సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా చింతల బుల్లి ప్రసాద్, పాము అప్పలనాయుడుతో పాటు మరో 28 మంది కమిటీ సభ్యులుగా నియమించడం జరిగింది. నాతవరం మండలం వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిగా లగుడు నాగేశ్వర్రావు, ఉపాధ్యక్షులుగా పైల పోతురాజు, సిరసపల్లి శేఖర్‌తో పాటు మరో 28 మంది కమిటీ సభ్యులను నియమించారు.

మాకవరపాలెం : వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడిగా కొండల అగ్రహారం మాజీ సర్పంచ్ చిటికెల రమణను నియమించారు. ఇప్పటివరకు అధ్యక్షుడిగా రుత్తల శ్రీనివాస్ కొనసాగారు. ఆయన స్థానంలో రమణ అధ్యక్షుడిగా, బూరుగుపాలేనికి చెందిన భీమిరెడ్డి గోవిందరావు, పీఏసీఎస్ మాజీ పర్సన్ ఇన్‌చార్జ్ పాళపు నాగేశ్వరరావులను ఉపాధ్యక్షులుగా నియమిస్తూ బుధవారం కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు విడుదలయ్యాయి. వీరితో పాటు నలుగురు ప్రధాన కార్యదర్శులు, ఐదుగురు కార్యదర్శులు, 20 మంది ఎగ్జిక్యూటివ్ సభ్యులను నియమించారు.

సమస్యల పరిష్కారంలో తహసీల్దార్ ఏకపక్ష వైఖరి

- అధికార పార్టీకి కొమ్ముకాస్తున్నారు..
- అనర్హుల పింఛన్ల సర్వే సక్రమంగా జరగలేదు
- ఎండాకాలం రాకుండానే కరెంట్ కోతలు
- మండల సమావేశంలో మండిపడ్డ సభ్యులు



తహసీల్దార్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జెడ్పీటీసీ రాంబాబు



మండల సమావేశంలో అధికారులను ప్రశ్నిస్తున్న పెదపూడి సర్పంచ్ వరకృష్ణ

బుచ్చెయ్యపేట : సమస్యలు పరిష్కారంలో మండల అధికారులు అవలంబిస్తున్న తీరుపై మండల ప్రజా ప్రతినిధులు ధ్వజమెత్తారు. ఎండాకాలం రాకుండానే విద్యుత్ కోతలు విధించడంపై అధికారపార్టీ ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి విద్యుత్‌శాఖ ఏఈ రాజుని ప్రశ్నించగా, తహసీల్దార్ లక్ష్మి ఒక పార్టీకి కొమ్ము కాస్తూ నిజాలు తెలుసుకోకుండా అధికార పార్టీ నాయకులు ఏం చెబితే అదే చేస్తున్నారని జెడ్పీటీసీ దొండా రాంబాబు ఆరోపించారు. ఆర్.శివరాంపురంలో 30 ఏళ్లగా నివాసం ఉంటున్న నమ్మి అప్పలరాజుకు ఎటువంటి నోటీసు ఇవ్వకుండా ఆమె పశువుల పాకను తహసీల్దార్ బలవంతంగా తొలగించడంపై జెడ్పీటీసీ నిలదీశారు. గ్రామ టీడీపీ నాయకులు చెప్పారని విచారణ చేయకుండా బలవంతంగా ఆమె లేని సమయంలో పాక తొలగించడం దారుణమన్నారు. ఇదే విషయమై పలుసార్లు తహసీల్దార్‌కు ఫోన్ చేసినా ఆమె ఫోన్ ఎత్తలేదని మండిపడ్డారు. తైపురంలో కూడా ప్రభుత్వ భూమిపై ఇరువర్గాల మధ్య గొడవలో వాస్తవాలు తెలుసుకోకుండా పోలీసులను పంపించి ఒక వర్గంవైపే తహసీల్దార్ కొమ్ము కాస్తూ లా అండ్ ఆర్డర్ సమస్యను తీసుకొచ్చేలా ప్రవర్తిస్తున్నారన్నారు. మండల సమావేశానికి తహసీల్దార్ హాజరు కాకపోవడంపైనా మండిపడ్డారు. ఇప్పటికైనా తహసీల్దార్ ప్రవర్తన మార్చుకోకపోతే పై అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఇటీవల అనర్హుల పింఛన్ల తొలగింపు సర్వే సరిగా జరగలేదని, చేతి బోర్లు ప్లాటుఫాంలు నాసిరకంగా నిర్మిస్తున్నారని, వడ్డాదిలో కలుషిత నీరు అందించడంపైన, శ్మశానంలో తాగునీటి సదుపాయం కల్పించకపోవడంపై, పెదపూడిలో విద్యుత్ సరఫరా అందించకపోవడంపై, వడ్డాదిలో విద్యుత్ కార్యాలయం స్థలం ఆక్రమణ, డ్వాక్రా రుణాలు బినామీలకు అందించడంపై, ఇంటింటి కుళాయి పనులు చేయకపోవడం తదితర సమస్యలపై ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు దొండా లలితా నారాయణమూర్తి, గోకివాడ వరకృష్ణ, సీతా బుజ్జి,పెదిరెడ్ల మాణిక్యం,కోరుకొండ లీలావతి రమణ, బాలకృష్ణ అధికారులను ప్రశ్నించారు. మూడు నెలలకు ఒకసారి జరిగే మండల సమావేశానికి పలు శాఖల అధికారులు హాజరుకాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో ఎంపీడీవో విజయలక్ష్మి, ఎస్ఐ శ్రీనివాసరావు, మండల జేఈ ప్రభు, ఏవో భాస్కరరావు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన దేవితల్లి తీర్థం



ప్రత్యేక అలంకరణలో దేవితల్లి అమ్మవారు

దేవరాపల్లి : దేవరాపల్లిలో ఉమామహేశ్వరీ దేవి(దేవి తల్లి) అమ్మవారి కల్యాణ, తీర్థం బుధవారంతో ఘనంగా ముగిసాయి. భీష్మ ఏకాదశిని పురస్కరించుకొని ఈ నెల 8న ప్రారంభమైన తీర్థ మహోత్సవాలు ఐదు రోజులు పాటు అంగరంగ వైభవంగా జరిగాయి. ఆఖరి రోజు బుధవారం అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి తదితర నాయకులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి ఎడ్ల పోటీల్లో విజయనగరం జిల్లా వల్లంపూడి సిద్ధి వినాయక ఎడ్లు విజేతగా నిలిచాయి. నర్సయ్యపేట, వావిలపాడు, దేవరాపల్లి, లక్కవరం, నర్సాపురం, కేజేపురం, ఎల్‌బీపట్నం ఎడ్లు వరసగా విజేతలుగా నిలువగా, వారికి నగదు బహుమతులు అందజేశారు.

కంటి శస్త్ర చికిత్సకు 15 మంది ఎంపిక



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

చోడవరం రూరల్ : స్థానిక స్వయంభూ గౌరీశ్వర స్వామి వారి దేవస్థానం ప్రాంగణంలో అనకాపల్లి జిల్లా అంధత్వ నివారణ సంస్థ, విశాఖ శంకర్ ఫౌండేషన్ వైద్య సిబ్బంది సహకారంతో బుధవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 15 కంటి రోగులకు శస్త్ర చిత్సలు అవసరమని గుర్తించారు. శిబిరానికి చోడవరం మండలం, ఇతర పరిసర మండలాలకు చెందిన 73 మంది కంటి రోగులు హాజరయ్యారు. కంటి వైద్య సిబ్బంది నిర్వహించిన పరీక్షలలో 15 మందిని ఎంపిక చేశారు. కంటి నరాల చికిత్స, కంటి నీటి కాసుల చికిత్స, కను రెప్పల చికిత్స, చిన్న పిల్లల చికిత్సలకు ఒక్కొక్కరు, కంటి పై పొర చికిత్సకు ఇద్దరు ఎంపిక కాగా ఇతరులందరికీ కంటి శస్త్ర చికిత్స చేయాల్సి ఉంది. వీరిని విశాఖలో శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి సిఫారసు చేసారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వైద్యులు హరిచందన, క్యాంపు మేనేజర్ అరుణ్‌కుమార్, వైద్య సిబ్బంది, శివాలయ అర్చకులు చలపతిరావు పాల్గొన్నారు.

గురుదేవుల ఆశ్రమంలో పౌర్ణమి పూజలు





పౌర్ణమి పూజల్లో పాల్గొన్న భక్తులు , పుష్పాలంకరణలో పాకలపాడు గురుదేవులు

నర్సీపట్నం : మున్సిపాలిటీ ఉత్తర వాహిని తీరాన వేంచేసిన పాకలపాడు గురుదేవుల ఆశ్రమంలో బుధవారం పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. భక్తులు ఉత్తరవాహిని నదిలో స్నానాలు ఆచరించి పూజల్లో పాల్గొన్నారు. వరుసగా మూడు నెలల పాటు పౌర్ణమి పూజలు నిర్వహిస్తే జాతక దోషాలు తొలగితాయని భక్తుల విశ్వాసం. దీంతో పౌర్ణమి పూజలకు నర్సీపట్నం పరిసర ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో గురుదేవుల ఆశ్రమం కోలాహలంగా మారింది. పూజల అనంతరం భక్తులు గురుదేవులను దర్శించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు అర్జునగిరిలో గుర్రాల పోటీలు

చీడికాడ : మండలంలోని అర్జునగిరిలో బుధవారం స్వయంభూ వరాహలక్ష్మీ నృసింహాస్వామి వారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా జిల్లాస్థాయి గుర్రాల పోటీలు నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ పోటీలు మధ్యాహ్నం 2గంటల నుంచి ఆలయం వద్ద జరుగుతాయని వారు తెలిపారు.

కుసర్లపూడిలో ఘనంగా మాఘ పౌర్ణమి



కుసర్లపూడి పంతులబాబు ఆలయం వద్ద అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

రోలుగుంట: మాఘ పౌర్ణమిని సందర్భంగా పాకలపాడు గురుదేవుల దేవాలయానికి భక్తులు వేకువజాము నుంచి అధిక సంఖ్యలో తరలి వచ్చి పూజలు చేశారు. నిర్వాహకులు మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరిపారు. సాయింత్రం ఆలయం వద్ద నిర్వాహకుడు మాజీ సర్పంచ్ గండి తాతాజీ, సింహాద్రి సమీప గ్రామాల వారికి భజన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

లింగంపేటలో మహాలక్ష్మి అమ్మవారి పండగ



నాతవరం : లింగంపేట గ్రామంలో బుధవారం శ్రీమహాలక్ష్మి అమ్మవారి పండగను భక్తులు ఘనంగా జరుపుకొన్నారు. గ్రామ దేవతగా పూజించే అమ్మవారు పండగను ప్రతి ఏటా ఫిబ్రవరి మాఘపౌర్ణమి సందర్భంగా జరపడం ఆనవాయితీ. బుధవారం వేకువజాము నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు అమ్మవారికి మొక్కుబడులు సమర్పించారు. భక్తులకు ఉత్సవ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఆలయం ప్రాంగణం వద్ద తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

ఆడియో, వీడియో ద్వారా కార్యక్రమం



విద్యార్థినులకు వీడియో ద్వారా అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రావికమతం : బాల్య వివాహాలు, సైబర్ నేరాలు, తదితర వాటి గురించి హైస్కూలు, కళాశాల విద్యార్థులకు బుధవారం ఆడియో, వీడియో ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు, బాల్యవివాహల వల్ల కలిగే అనర్థాలు, సైబర్ నేరాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పోక్సో, మత్తు పదార్థాల వినియోగంపై ఆడియో వీడియో ద్వారా ఈ కార్యక్రమం నిర్వహించారు. రావికమతం పోలీసుస్టేషన్ పరిధిలో గల తట్టబంద, తోటకూరపాలెం, హైస్కూలు విద్యార్థులకు, కొత్తకోట పోలీసుస్టేషన్ పరిధిలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాల, జెడ్పీ హైస్కూలు ఆర్కబర్డ్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులకు ఈ కార్యక్రమం నిర్వహించారు. సచివాలయం మహిళా పోలీసు కిరణ్‌కుమారి పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలు ఈశ్రమ్ రిజిస్ట్రేషన్‌లు చేయించుకోవాలి

వీవోఏల సమావేశంలో ఏపీఎం చినబాబు



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం చినబాబు

కె.కోటపాడు : డ్వాక్రా సంఘాల్లో సభ్యులుగా ఉన్న 59 ఏళ్ల వయస్సులోపు ఉన్న మహిళలు ఈశ్రమ్ రిజిస్ట్రేషన్‌ను చేయించుకోవాలని వెలుగు ఏపీఎం చినబాబు అన్నారు. వెలుగు కార్యాలయంలో బుధవారం ఆయన వీవోఏలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పీఎఫ్, ఈఎస్ఐలు వర్తించని వారు పోస్టాఫీస్, మీసేవా, గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. ఈశ్రమ్ రిజిస్ట్రేషన్ చేయించుకున్న లబ్ధిదారులు మరణిస్తే రూ.2 లక్షలు, ప్రమాదాల బారిన పడితే అంగవైకల్యం పరిస్థితిని బట్టి రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకూ ఆర్థికసాయం లభిస్తుందన్నారు. 2024-25 కాలానికి మండలంలో గల డ్వాక్రా సంఘాలకు రూ.60 కోట్లు బ్యాంకు లింకేజి రుణాలు లక్ష్యం కాగా, ప్రస్తుతానికి 426 సంఘాలకు రూ.40 కోట్లు రుణాలను ఇచ్చినట్టు తెలిపారు. డ్వాక్రా సభ్యులు ప్రతి నెలా బ్యాంక్‌లకు రుణాలను సక్రమంగా చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సీసీలు వెంకటరావు, సన్యాసిరావు, సింహచలంనాయుడు, ఉమామహేశ్వరి, సత్యనారాయణ, సురేష్ పాల్గొన్నారు.

డార్విన్ పరిశోధనలు శాస్త్ర ప్రగతికి ఊతం



క్విజ్ విజేత విద్యార్థినికి బహుమతి ప్రదానం

చోడవరం రూరల్ : జీవ శాస్త్రంలో దివంగత శాస్త్రవేత్త చార్లెస్ డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతంతో పాటు పలు అంశాలలో ఆయన చేసిన విస్తృత పరిశోధనల ఫలితమే నేటి వైద్య శాస్త్ర ఉన్నతికి దోహదపడ్డాయని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఐ.వి.వి. సత్యవతి అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జీవశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో చార్లెస్ డార్విన్ జయంతిని నిర్వహించారు. డార్విన్ పరిశోధనలు వాటి ఫలితాలను గురించి ఆమె విద్యార్థులకు వివరించారు. విభాగాధిపతి నారాయణమూర్తి మాట్లాడుతూ జీవ శాస్త్రం మానవ జీవ పరిణామం గురించి డార్విన్ చేసిన పరిశోధనలను వివరించారు. విద్యార్థులకు ఈ అంశం పట్ల క్విజ్ పోటీ నిర్వహించి, విజేత విద్యార్థులకు బహుమతులు అందచేశారు.